
# జరిగిన సంగతి



**కాండేపూడి సూర్యకామరాజు**

ఎనభై నిమిషాలనుంచీ ఎదురుచూస్తూన్న బస్సు దుమ్మెత్తిపోసుకుంటూ దూసుకు వస్తోంది. బెడ్డింగ్‌మీద కూర్చునివున్న నా స్నేహితుడు చెంచయ్య లేచి, అప్పటిదాకా తను పొందిన చిరాకు ముక్కమ్మట చీదిపారేసి రోడ్డు మధ్యకు నడిచాడు. జేబు రుమాలు ముక్కుకి అడ్డుపెట్టుకుని నేనుకూడా అతడిని అనుసరించాను. చెంచయ్య చేసైగకి కట్టుబడి చలనహేతుశకటం ఆగింది.

ఖాళీగావున్న ఫ్రంటుసీటులో ప్రవేశించే నిమిత్తం కాలు ఫుట్‌బోర్డ్‌మీద పెట్టబోయాడు, స్నేహితుడు.

"ఆయనకూడా వస్తాడా?" డ్రయివరు చెంచయ్యని అడిగాడు.

"ఆ" అన్నాడు మావాడు

"అయితే ఖాళీలేదండి" అంటూనే కారు పోనిచ్చాడు. పుస్తె కట్టేటప్పుడు పెళ్లికూతురు మాయమైతే వుండే పెళ్ళికొడుకు ముఖభంగిమ, దుమ్ము తెర అడ్డువున్నా. చెంచయ్య ముఖంలో చూడకలిగాను. నేనుమాత్రం ఏమీ జరగనట్టుగా నా ట్రంకుమీద కూర్చుని సిగరెట్టు ముట్టించాను:

"ఏంరా, నువ్వు వస్తానని చెప్పగానే వచ్చి మించి కాలుతీసేశాడు, ఏమిటి సంగతీ?" నా దగ్గరికి వచ్చి చెంచయ్య అడిగాడు.

"సంగతికేముందీ? ఖాళీలేదని చెప్పాడుగా- ఈ రూట్‌లో ఓవర్‌లోడ్ చెయ్యరు."

"ఖాళీలేక పోవడమేమిటి— ఫ్రంటుసీటులో యిద్దరికి ఖాళీవుంది; వెనక సీటులో సగానికిపైగా నిర్మానుష్యమే!"

నేనేమీ మాట్లాడలేదు.

'తమాషాగా వుందే!—ఇందాకటినుంచీ తెగ కోశావే, ఈ రూటులో బస్సువాళ్ళందరికీ నువ్వంటే సింహస్వప్నమనీ, నువ్వెక్కడ కనపడినా ఫ్రంటుసీటు ఖాళీచేయించి నిన్ను ఆహ్వానిస్తారనీ.'

ఇదే మరెవరయినా అయితే తర్కంతో నా కోతల్ని సమర్థించుకొని వుందును. కాని చెంచయ్య దగ్గర యివన్నీ పనికిరావని నాకు తెలుసు; ఆవలిస్తే పేగులు లెక్కపెడతాడు. అందువల్ల కుక్కిన పేనుకి మల్లే కూర్చున్నాను.

'దీనికంతకీ ఏదో కారణం వుండితీరాలి ఉన్నదున్నట్లు చెప్తే నీకీ సిగరెట్ కేస్ ప్రెజెంట్ చేస్తా. చెప్పు, జరిగిన సంగతేమిటో' సిల్వర్ కేస్ విప్పి సిగరెట్టు తీస్తూ, కుతూహలంతో అడిగాడు.

కోతల్ని సమర్థించుకోటానికి కోర్టు కెక్కేవాళ్లుకూడా వుంటారని నాకు తెలుసు. కాని నేను వాళ్ళంత వెర్రివాడినికాను. సిల్వర్ సిగరెట్ కేస్ రాగా మోకాలడ్డుతానా!

పారవెయ్యబోతున్న సిగరెట్ ముక్కతో మరో సిగరెట్టు ముట్టించి-

'అయితే చెప్తా విను' అన్నాను.

'జరిగిందంతా పూస గుచ్చినట్టు చెప్పాలి' అన్నాడు,

'అల్లాగే—ఒకసారి, అంటే నువ్వు బొంబాయి వెడుతూ నాకు బెజవాడ స్టేషన్‌లో కనపడక పూర్వం, ఈ బస్సులో ప్రయాణం చెయ్యటం తటస్థించింది. డ్రైవర్‌కూడా వీడే.'

'అది నువ్వు చెప్పేదేమిటి? నీ ముఖమే చెప్తుతోంది.'

'అలా అడ్డంతగుల్తే నేచెప్పను. వింటే మాట్లాడ కుండా విను. లేకపోతే మానెయ్.'

సరే మాట్లాడనులే, చెప్పు.'

'—నేను రెండోసీటు, అంటే ఫ్రంటుసీటు వెనకవుండే సీటులో కూర్చున్నాను. నేను కాక ఆసీటులో యింకా అయిదుగురున్నారు. అందులో ముగ్గురు గజాంగులు. అందులో ఒకడి కుడికాలు నాకాలిని బస్సుకుదుపులో స్క్వీజ్ చేస్తోంది.'

'వర్ణనలెందుకూ ?—అసలుసంగతి !'

'మరందుకే- వర్ణనలు లేకపోతే అప్పటి పరిస్థితులన్నీ నీ కర్థంకావు.'

'ఊఁ ఊఁ... చెప్పు.'

''—కొంతదూరం వెళ్లాక ఏదో గ్రామంలో బస్సు ఆగింది. ముగ్గుర్ని మా సీటులో ఎక్కించి—జరగండి, జరగండి అని కండక్టరు నా కాలు తట్టాడు. జరగడానికి ప్రయత్నించాను కాని, నా తరవాత కూర్చున్న లావాటి పెద్దమనిషి ఒక అంగుళం కూడా జరగలేదు. నిజానికి జరగటానికి చోటు కూడా లేదు.

'జరగమంటే ఏమిటండీ, అలా చూస్తారూ ?- ఆసీటులో ఆరుగురు కూర్చోవాలి' అని కండక్టరు మొరటుగా అన్నాడు.

'ఇందులో ఆరుగురం వున్నాం. ఇంకెక్కడికి జరగడం' అన్నాను.

'అయితే తొమ్మిదిమంది కూచోవాలండి' అని కండక్టరు పెడసరంగా అన్నాడు. నాకు ఒళ్లు మండింది.

'నేను జరగనయ్యా; ఒక్క అంగుళంకూడా జరగను' అన్నాను.

'ఎందుకు జరగవయ్యా? జరుగు జరుగు, అట్టే మాట్లాడక' అంటూ డ్రయివరు అంటిపుచ్చుకున్నాడు-

చెప్పొద్దూ, నాకు కొంచెం భయంవేసింది.

'ఎల్లా జరగను చెప్పండి, ఖాళీలేందే' అన్నాను.

'అదంతా ఖాళీకాదూ?—ఓహో' స్థూలకాయులవైపు చూపి, డ్రయివరు అన్నాడు.

'పోనీ ఆ ఫ్రంటుసీటు ఖాళీగా వుందిగా వారిని అందులో కూర్చోపెట్టకూడదూ?' అని, జరగటానికి విఫల ప్రయత్నం చేస్తూనే, అన్నాను.

'మా యిష్టం వచ్చినచోట కూచోపెడతాం, నువ్వెవడివి చెప్పడానికి?' స్టీరింగుని చేతుల్లో గట్టిగా బిగించి, ప్రపంచమంతా తన పిడికిట్లో వున్నట్టుగా, డ్రయివరు హుంకరించాడు.

నాకు పిచ్చికోపమొచ్చిందంటే నమ్మ.

'ఆ రోజులు పోయాయ్. ఇప్పుడు మీ ఆటలు సాగవ్. నేషనల్ గవర్నమెంటు, ఏమనుకున్నావో' అన్నాను.

'ఇటువంటి గవర్నమెంట్లు చాలా చూశాం. ఏం చెయ్యగలవయ్యా నువ్వు' అంటూ, అడ్డంగా వున్న తలకాయని తనచేత్తో పక్కకినెట్టి డ్రయివరు నాకేసి చూస్తూ దబాయించాడు.

'ఏం చేస్తానో నీ కెందుకు చెప్పటం?—అసలు నాతో మాట్లాడటానికి నీకేమీ అధికారంలేదు. కండక్టరు అడిగితే సమాధానం చెప్తా' అన్నాను.

'నేనే కండక్టరిని' డ్రయివరే అన్నాడు.

'మరి డ్రయివరు?'

'నేనే డ్రయివరిని.'

ఆవిధంగా అర్థంలేని వితండవాదన మొదలెట్టాడు. అలా టప్పుడు నాకెలా వుంటుందో ఊహించు.''

'సరే లే. తర్వాతేమయింది?'

''చెబుతున్నా నా—బస్సుఎక్కిన ముగ్గుర్లో ఒకడిని కండక్టరు నా ఒళ్ళో కూర్చోపెట్టాడు. మిగతా యిద్దరూ మరొకళ్ళ వొళ్లో సర్దుకున్నారు. బస్సు పోసాగింది, అయిపోయిందేదో అయిపోయిందని వూరుకోడే!

'ఎక్కించేదాకా ఒక ఏడుపూ, ఎక్కించాక ఇంకొక ఏడుపూ' డ్రయివరు ప్రక్కన కూర్చున్న కండక్టరుతో అన్నాడు.

నేనేం అనలేదు. కాని వాడు మానుతేగా.

'సొంత కారనుకున్నాడేమో' మళ్లీ అన్నాడు.

'సొంత కారయితే యింత గొడవెందుకూ ? ఈపాటికప్పుడే పట్నం చేరుకుందును' అని నే నన గానే డ్రయివరేదో గొణిగాడు, అది నాకు సరిగా వినపడకపోయినా-

'ఈ మొఖానికి సొంతకారుకూడాను' అని వుంటాడని గ్రహించాను.''

'ఇంతఘర్షణ జరుగుతుంటే పేసెంజర్లందరూ వూరుకున్నారూ ?- నీకు సపోర్టెవరూ రాలేదూ?'

ఆసీ, జరిగిన కొబ్బరిచెట్టు నీడలోకి తన బెడ్డింగు కొంచెం జరిపి, చెంచయ్య అడిగాడు.

'ఆయనుంటే మంగళెందుకూ?- ఒక్కడు కూడా నోరెత్తలేదు. పేసెంజర్లు కట్టుగావుంటే కారు వాళ్ళ ఆటలు ఆవిధంగా సాగుతాయా ?-'

హారను వినపడింది. మంత్రిగారు ఉపన్యాస వేదిక ఎక్కగానే ప్రేక్షకులు లేచి నిలబడ్డట్టుగా లేచి నిలబడ్డాం. గమనవేగం ఏమాత్రం తగ్గకుండా బస్సు మమ్మల్ని దాటిపోయింది. ఒకళ్ళముఖాలు ఒకళ్లు చూసుకొని, ఆపాదమస్తకపర్యంతం మరొక కోటింగుతో మళ్ళీ యథాస్థానాల్లో కూలబడ్డాం.

'నేను చెప్పలేదూ, ఈ రూట్ లో ఓవర్ లోడ్ చెయ్యరని' అన్నాను, ద్రాక్షపళ్లు అందుకోలేని నక్కలాగ.

'ఆరుగురు కూర్చునే సీటులో తొమ్మండుగురిని కుక్కినారని యిప్పుడే కాదూ చెప్పావ్. ఇంకా వోవర్ లోడ్ చెయ్యకపోవడమేమిటి?' చెంచయ్య అన్నాడు.

'అప్పుడు జాతీయప్రభుత్వం యింకా బాల్య దశలోనేవుంది. మరిప్పుడా- మంచి కట్టుదిట్టంగా వున్నారుకదూ మనవాళ్లు' అన్నాను.

"సరేలే- తర్వాతేం జరిగింది?"

"——నాలో అగ్ని, రగుల్కొంటూనే వుంది. పట్నం చేరగానే తిన్నగా పోలీస్ స్టేషన్ కుపోయి జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ఒకరిపోర్టుచేసి డ్రయివరు పని పట్టిద్దామని నిమిషాలు లెక్కపెడుతూ కూర్చున్నాను. మళ్లా యింకోవూళ్లో బస్సాగింది. ఎక్కేవాళ్లూ,దిగేవాళ్లూ లేకపోయినా బస్సు అరగంటకుపైగా ఆగిపోయిందక్కడ. వాకబు చెయ్యగా కండక్టరు తాలూకు కావలసిన వాళ్లెవరో ఆ బస్సులో పట్నందాకావస్తారనీ, సామాను సర్దుకొని యింకొక్క పదినిమిషాల్లో వచ్చేస్తారని తెలిసింది. అదీ మన మంచికేనని ఓపికపట్టి కూర్చున్నాను. మంచేమిటని అడుగుతావేమో, అదంతా మన కేసుకి బలంగా వుంటుంది చూడూ."

'ఊఁ కానియ్."

"——ఎల్లాగయితేనేం మరొక పావుగంటకి కండక్టరు తాలూకు ఆడంగులు రావటం, ఒకసీటు వారికై పూర్తిగా ఖాళీకావటం, మరొకసీటులో జనసంఖ్య వృద్ధిపొందటం జరగటంతో బస్సు కదిలింది. సిగరెట్టు కాలుస్తూ వుండటంచేతో ఏమో డ్రయివరు నోరు చెయ్యకుండానే తన సారథ్యాన్ని సాగిస్తున్నాడు. డ్రయివరు ఎన్ని నేరాలకు బాధ్యుడో (సిగరెట్టు కాల్చడంతో సహా) అతడిమీద ఏవిధంగా చర్య తీసుకోవచ్చో గల లీగల్ పాయింట్లు ఆలోచిస్తూ కూర్చున్నాను.

'ఎందాకా వెడతారు ?' నాపక్లో కూర్చున్న ఆసామీ అడిగాడు.

'పోలీసుస్టేషనుదాకా' అన్నాను, డ్రయివర్ కి వినపడేటట్టు.

'పోలీస్ స్టేషనుకి వెళ్ళి మహా పొడిచేస్తాడు ! ఇటువంటివాళ్ళని లక్షమందిని చూశాం' అంటూ మొట్టమొదటిసారిగా ఎలక్ట్రిక్ హారన్ మోగించాడు.

'ఇటువంటి డ్రయివర్లని లక్షన్నర మందిని చూశాను' నాపక్లో కూర్చున్నఆయనతో మెల్లగా అన్నాను."

'నీకెందుకంత భయం ?- నీ చేతకానితనం కనిపెట్టే వాడలా ఆడించాడు నిన్ను' అని చెంచయ్య నవ్వుతూ అన్నాడు.

'భయంకాకపోతే మరేమిటి ? వాడూ నేనూ కొట్టుకోవటం వరకూ వస్తే ఏమవుతుందో చెప్పు ! వాళ్లకు కొట్లాటలు మామూలే. మనం ఒక దెబ్బ తింటే ఎంతోఫీలవుతాం- ప్రొహిబిషన్ ఫోర్సులో వుంది కాబట్టి ఆమాత్రమయినా వాడిని దబాయించ కలిగాను.'

'ఊఁ, దబాయించావులే-తరవాత?' చెంచయ్య నవ్వుతూనే అన్నాడు.

'——మరొకచోట బస్సు మళ్లీ ఆగింది. పక్కనున్న యింట్లోంచి కండక్టరూ మరొకడూ కలిసి బరువు బస్తా (బహుశా బియ్యం అయివుంటాయి) మోసుకొచ్చి బస్సు వెనకభాగంలో సీటుకీ సీటుకీ మధ్యవుండే జాగాలో అతి కష్టంమీద జేర్చారు. ఇంకొకడు కట్టెలమోపు తీసుకొచ్చి టాపుమీద పడేశాడు. మరొకక్షణానికి కాకీ యూనిఫారమ్ బయటకు వచ్చి బస్సుని ఇనస్పెక్షన్ దృష్టితో చూసి మళ్లీ లోపలికి వెళ్ళిపోయింది. ప్రయాణీకుల సంభాషణనిబట్టి సబినస్పెక్టరుగారి భార్య పుట్టిల్లు అదేననీ, భార్యతో మూడునిమిషాలు ముచ్చటించి త్వరగా వచ్చేస్తారనీ గ్రహించాను. ముప్పావుగంటలో ఇనస్పెక్టరుగారు ఫ్రంటు సీటులో ఆసీనులయ్యారు. వెంటనే బస్సు సాగింది.

నాకు వేడుకపోయిన తీగె కాళ్ళకు తగులు కున్నట్టు అయింది. బస్సు పట్నం చేరగానే జరిగిన సంగతి యినస్పెక్టరుగారికి విన్నవించి డ్రయివరు పని...'

'బస్సు వస్తోన్నట్టుంది' అని చెంచయ్య లేచి నిలబడ్డాడు.

ఇంకో రెండు నిమిషాలకి బస్సు రావటంపోవటం కూడా జరిగిపోయింది. దాని చక్రధూళి శిరస్సున దాల్చటం తప్ప యింకేమీ చెయ్యలేక పోయాం.

"మాయ బస్సులు—ఈ వేళటికి మన ప్రయాణం సాగదేమో." చెంచయ్య నిస్పృహతో అన్నాడు.

"అక్కర్లేదు, వచ్చేబస్సులన్నీ ఖాళీగానే వుంటాయి" అని అతడికి ధైర్యంచెప్పి జరిగిననీడ లోకి నా ట్రంకు లాక్కొని కూర్చున్నాను.

"సరే కథకానియ్" తెల్లటి చొక్కామీది దుమ్ము దులుపుకుంటూ చెంచయ్య అన్నాడు.

"అయిపోవచ్చింది, సిగరెట్ కేస్ యియ్యి" అన్నాను.

"ఇస్తానని అంటే యిచ్చితీర్తాను. తరవాయి కానియ్." అన్నాడు.

"—బస్సు మళ్లీ ఆగింది. అందర్నీ దిగమని కండక్టరు ఆజ్ఞాపించాడు. ఇనస్పెక్టరు గారితో సహా అందరూ బస్సుదిగారు. ఏదో కొంప మునిగింది కాబోలు భగవంతుడా అనుకొని, తిమ్మిరెక్కిన కాలు సర్దుకుంటూ నేనూ దిగాను. కండక్టరు జాకీ ఎత్తి బస్సుకింద గోనెపట్టా పరుచుకొని వెల్లకిలా పడుకున్నాడు. డ్రయివరు మున్ఫైగజాల దూరంలో కంకరగుట్టమీద కూర్చుని బీడీ కాల్చుకొంటు న్నాడు. ఇనస్పెక్టరుగారు మాత్రం ఒక కాలు ఫుట్‌బోర్డుమీదా, ఒక కాలు క్రిందా పెట్టి టాపు మీద ఊడిపోయిన కట్టెలమోపువైపు చూస్తు న్నారు. ఇదే సమయమని నేనాయనను సమీపించి నమస్కరించాను. ఆయన నన్ను కిందనించి మీద దాకా చూసి—

'ఏమిటి సంగతి?' అన్నారు.

'ఏమీలేదండి, ఈ బస్సువాళ్ళ దుండగాలు కొమకు విన్నవిద్దామని' అని వినయంగా అన్నాను.

ఆయన ఏమీ అనకుండా ముఖం యింకోవైపు తిప్పేశారు.

'ఈ బస్సుడ్రయివరు బలే పొగరుబోతండి. అంతా తన యిష్టమంటాడు. తనే కండక్టరు, తనే డ్రయివరూట. ఇవన్నీ మీకు తెలుస్తే ఏం జరుగుతుందో ఊహించుకో లేకపోయాడు' అన్నాను.

'ఓనరు కూడా అతడే' విశేషార్థాన్ని ధ్వనింప చేస్తూ అన్నాడాయన.

'ఓనరయితే మాత్రం!- మీరు కల్పించుకుంటే అతడిగతి ఏమవుతుందో ఆలోచించండి' ఒక విధంగా ఆయన్ను పొగుడుతూ అన్నాను.

'నేను కల్పించుకుంటేమాత్రం...అతడికి సర్కిల్‌కీ ప్రాణస్నేహం. అటువంటి—' ఆయన మాట పూర్తి కాకుండానే యింకొక బస్సు వచ్చి ఆగింది. అందులో ఎక్కి ఆయన చల్లగా జారుకున్నాడు. నీకేం నువ్వు నవ్వుతావ్. నా కాసమయంలో అమాంతం ఆత్మహత్య చేసుకుందామన్నంత కోపం వచ్చిందంటే నమ్ము.'

'కథ పూర్తయిందా?' చెంచయ్య నవ్వుతూ జేబులోంచి సిగరెట్ కేస్ తీశాడు.

'అవకేం జేస్తుంది-బస్సు చూస్తే యింకా కదిలేటట్టు లేదు. కడుపులో ఆకలీ, మనస్సులో అగ్నీ దహించి పారేశాయి. ఈ పాడుబస్సు ఎక్కకూడదని మిగతా రెండుమైళ్లూ నడిచి మా మేనత్తగారిల్లు చేరుకున్నాను. అదీ జరిగిన సంగతి. ఇంక తే, సిగరెట్ కేసు.'

చెంచయ్య పెద్దగా నవ్వి—

'మరి పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళలేదూ!' అన్నాడు.

'ఇంకెందుకు వెళ్లటం, అదో దండగ.'

'ఏం, నేషనల్ గవర్నమెంటే—'

'అప్పుడు మనవాళ్ళకి కొత్త కాదుటయ్యా, ఇప్పుడు సాగుతా యనుకున్నావా యీ బస్సువాళ్ల ఆటలు?'

'సరే, సాగకపోతే మంచిదేగా. బస్సు వస్తో న్నట్టుందిరా.'

ఇనపపూచ పట్టుకుని ముందు మడ్‌గార్డ్‌మీద యిద్దరం కూర్చున్నాం. వెండి సిగరెట్ కేస్ సంపాదించానన్న సంతోషంలో, దుమ్మురేపిల్చినా - నా కొట్టే తుమ్ములు రాలేదు.